మనిషి ప్రాణం ఖరీదుకు వెలకట్టలేం


బెస్ట్ సేఫ్టీ ఫాలోయింగ్ వర్కర్స్ అవార్డ్స్ అందజేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, శివకుమార్ రెడ్డి

- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి
- ఘనంగా 52వ జాతీయ భద్రతా దినోత్సవం

గుంటూరు వెస్ట్: మనిషి ప్రాణానికి ప్రత్యామ్నాయం లేదని, దానిని నిర్లక్ష్యంగా పోగొట్టుకోకూడదని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలో 52వ జాతీయ భద్రతా వారోత్సవాల కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న ప్రపంచంలో అనేక అత్యాధునిక విధానాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఫ్యాక్టరీ యజమానులు ఎప్పటికప్పుడు వీటిని అప్‌డేట్ చేసుకోవడంతోపాటు కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో రాష్ట్రంలో లక్షల కోట్ల విలువైన పరిశ్రమలు రానున్నాయని చెప్పారు. సిబ్బంది, అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పరిశ్రమల్లో బాల కార్మికులను గుర్తించి నివారించాలని చెప్పారు. ముఖ్యంగా చాలా ప్రమాదాలు నిర్లక్ష్యం వల్లనే జరుగుతున్నట్లు ఒక అధ్యయనం చెబుతుందన్నారు. రోజూ చేసే పనే కదా అని నిర్లక్ష్యంగా ఉండవద్దని, ప్రతి ఉద్యోగి నిత్యం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వివరించారు. డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎం.వి.శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ చిన్న చిన్న ప్రమాదాలు ఎంతో నష్టాన్ని కలిగిస్తాయన్నారు. కర్మాగారాల పరిధి బాగా విస్తరిస్తోందన్నారు. అనంతరం విధుల్లో ప్రతిభకనబరచిన 53 మందికి బెస్ట్ సేఫ్టీ ఫాలోయింగ్ వర్కర్స్ అవార్డ్స్‌ను కలెక్టర్, శివకుమార్ రెడ్డిలు అందజేశారు.

నిర్మాణ రంగంలో భద్రతే కీలకం

భజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ


ప్రతిజ్ఞ చేయిస్తున్న భజరంగ్ సీఈఓ అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు(గుంటూరు): భవన నిర్మాణ రంగంలో భద్రతే కీలకమని, ముందస్తు జాగ్రత్త చర్యలకు అగ్ర ప్రాధాన్యం ఇస్తూ భజరంగ్ అర్బన్ ఇన్ఫ్రా నిర్మాణ ప్రణాళికలను అమలు చేస్తున్నట్లు భజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ తెలిపారు. పట్టాభిపురంలోని భజరంగ్ ఇన్ఫ్రా కార్యాలయంలో జాతీయ భద్రత దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముందుగా భద్రత పతాకాన్ని అవిష్కరించారు. అనంతరం కార్యాలయం సిబ్బంది, నిర్మాణరంగ సిబ్బందితో కలిసి భద్రత ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది మా లక్ష్యం హానిలేని కార్యాచరణ అన్న నినాదాన్ని నూటికి నూరు శాతం అమలు చేయడమేనని స్పష్టం చేశారు. ప్రమాద రహితమే తమ ప్రధాన నినాదమని పేర్కొన్నారు. సంస్థ ఆరంభం నుంచి భద్రతా చర్యలను అత్యంత నిబద్ధతతో పాటిస్తున్న సంస్థగా బజరంగ్ సంస్థ తన ప్రత్యేకతను కొనసాగిస్తోందన్నారు. జాతీయ భద్రత దినోత్సవం ప్రతి ఏడాది మార్చి 4వ తేదీన జరుపుకోవడం జరుగుతుందని వెల్లడించారు. నిర్మాణ సంస్థలు పరిశ్రమలు, వివిధ రకాల వృత్తి సంస్థలు తమ యాజమాన్యంలో భద్రతా ప్రమాణాలు పాటించేలా ప్రోత్సహించడం లక్ష్యమన్నారు. మన సమాజంలో భద్రత, పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు ఈ రోజును ప్రత్యేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలను అనుసరించి ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజలు కూడా తమ జీవనశైలిలో నిర్లక్ష్యాన్ని వీడి ఖచ్చితంగా వివిధ భద్రతా చర్యలు, పరిశుభ్రత చర్యలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. సాధారణ ప్రజలకు ఈ విషయాలపై ప్రచారం చేయడం, అవగాహన కల్పించడం వంటి పనులు చేయాలని సిబ్బందికి సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు రావడం శుభ పరిణామని, రాబోవు రోజుల్లో పారిశ్రామిక అభివృద్ధి ద్వారా నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని విశ్వాసం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పారిశ్రామిక రంగం తరపున ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బజరంగ్ ఫౌండేషన్ డైరెక్టర్లు ఎస్.శ్రీనివాసరావు, జి.సుబ్బారావు, ఎస్.సమీర్ నందన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల శ్రేయస్సే జోసిల్ లక్ష్యం

ఘనంగా జాతీయ భద్రతా వారోత్సవాలు



ర్యాలీలో పాల్గొన్న ఇన్‌స్పెక్టర్ శివకుమార్ రెడ్డి, సెక్రటరీ కె.రఘురాం తదితరులు

మేడికొండూరు: కార్మికుల భద్రతే లక్ష్యంగా జోసిల్ కంపెనీ సమకూర్చే ప్రామాణికాలను ఇతర కంపెనీలు ఆదర్శంగా తీసుకుని పాటించాలని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ యం.వి.శివకుమార్ రెడ్డి వెల్లడించారు. జాతీయ భద్రతా వారోత్సవాలు ఈ నెల 4 నుంచి 10 వరకు జరగనున్నాయి. అందులో భాగంగా మండలంలోని డోకిపర్రు జోసిల్ కంపెనీలో శనివారం ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి యం.వి శివకుమార్ రెడ్డి పాల్గొన్నారు. తొలుత జోసిల్ కంపెనీలో భద్రతా వారోత్సవాల జెండాను ఎగురవేశారు. అనంతరం భద్రత వారోత్సవంపై ప్రత్యేక ర్యాలీని నిర్వహించారు. భద్రతా ప్రమాణాన్ని చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమానికి కంపెనీ సెక్రెటరీ, డీజీయం ఫైనాన్స్ కె.రఘురాం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ యం.వి. శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ కర్మాగారాలలో కార్మికులు ఎప్పుడూ తాను భద్రంగా ఉండి, ఇతరుల భద్రతకు సహాయ పడే విధంగా ప్రతిఒక్కరూ ఉండాలన్నారు. కార్మికుల భద్రతకు జోసిల్ కంపెనీ ప్రాధాన్యత ఇవ్వడం గర్వించ దగ్గ విషయమన్నారు.

ఈ కార్యక్రమంలో కంపెనీ అడ్వైజర్ డెవలప్‌మెంట్ యడ్లపాటి భానుప్రసాద్, ఏజీయం ప్రొడక్షన్ యస్‌కే జానీబాషా, మేనేజర్ ఇంజినీరింగ్ కుందుల వెంకటేశ్వరరావు, మేనేజర్ జాగర్లమూడి శ్రీనివాసరావు, సోప్ నూడిల్స్ మేనేజర్ బత్తుల సురేంద్ర, మేనేజర్ క్వాలిటీ కంట్రోల్ కె.నాగమల్లేశ్వరావు, సీనియర్ మేనేజర్ అకౌంట్స్ బి.శేషగిరిరావు, పలు విభాగాల సూపర్‌వైజర్లు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు శ్రేష్టమైన కార్యాలు చేసే దేవుడు

- పాస్టర్ రమేష్
- మూడో రోజు కొనసాగిన 46వ గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలు
- నాలుగు లక్షలకు పైగా పాల్గొన్న భక్తులు


ప్రార్థనలో పాల్గొన్న జూపూడి ప్రభాకరరావు, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, నెల్లూరు జిల్లా ఎస్పీ విజయారావు, బ్రదర్ అబ్రహాం, పాస్టర్ జాన్‌వెస్లీ

గుంటూరు రూరల్: ఏసుక్రీస్తు శ్రేష్టమైన కార్యాలు చేసే దేవుడని పాస్టర్ రమేష్ ఉద్బోధించారు. నగర శివారు గోరంట్లలో హోసన్నా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో 46వ గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలు శనివారం మూడో రోజు కొనసాగాయి. తిరుపతికి చెందిన పాస్టర్ సాగర్ ప్రత్యేక ప్రార్థన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జ్యోతిర్మయుడా.. దేవుని తేజస్సులో మధురం.. ఏదో ఆశతో నాలో జీవించనీ అనే క్రీస్తు స్తుతి గీతాల్ని హోసన్న మినిస్ట్రీస్ పాస్టర్స్, సిస్టర్స్ బృందం ఆలపించారు. నైజీరియాకు చెందిన భక్తులు గుడారాల పండుగ శుభాకాంక్షల్ని భక్తులకు తెలియజేశారు. అద్దంకికి చెందిన డెఫ్ అండ్ డెమ్ చిన్నారులు క్రీస్తు స్తుతి గీతాల్ని మోనో యాక్షన్‌తో చేసి చూపారు. హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్ వెస్లీ, పాస్టర్ రాజు, పాస్టర్ ప్రెడిపాల్‌లు క్రీస్తు నామాన్ని ఘనపరుస్తూ ప్రత్యేక ప్రార్థన చేశారు. పాస్టర్ రమేష్ క్రీస్తు సందేశాన్ని భక్తులకు అందజేశారు. క్రీస్తు భక్తుల ప్రార్థన తెలివితో అనుభవంతో కూడినదై ఉండాలని చెప్పారు. ఏసుక్రీస్తు ఆయన భక్తులకు శ్రేష్టమైన వరములను అందజేస్తాడన్నారు. ఆయన భక్తుల బుద్ధి శ్రేష్టంగా ఉండాలని సూచించారు. ఏసుక్రీస్తు తన రక్తంతో భక్తుల్ని శుద్ధి చేస్తాడని, మంచి బుద్ధి కలుగజేస్తాడని చెప్పారు. ఆయన యందు భయభక్తులు కలిగిన వారిని శక్తివంతులుగా తీర్చిదిద్దుతాడని తెలిపారు. పాస్టర్ రాజు మాట్లాడుతూ ఘనుడైన దేవుడు అగ్నిజ్వాలగా ఉండి పాపాన్ని దహించును.. ఘనుడైన ప్రభువు పాపపు చీకటిని తొలగించును.. పరిశుద్ధమైన దేవుడు ఘనమైన కార్యాలు చేస్తాడని చెప్పారు. ఆయన మన సరిహద్దుల్లో సమాధానం కలుగ జేస్తాడని, వినయం కలిగిన వారిని జీవింపజేస్తాడని ఉద్బోధించారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. క్రీస్తుని భక్తులకు గుడారాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఏసు క్రీస్తు కృపతో ప్రతి ఒక్కరూ సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకరరావు ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని భక్తులకు శుభాకాంక్షలు అందజేశారు. ఉదయం ప్రత్యేక ప్రార్థనల్ని కొలిమిగుండ్లకు చెందిన పాస్టర్ జేమ్స్ ప్రత్యేక ప్రార్థన చేసి ప్రారంభించారు. నంద్యాలకు చెందిన పాస్టర్ అనిల్ క్రీస్తు సందేశాన్ని అందజేశారు. భక్తులు కన్నీటితో అడిగిన కోర్కెల్ని ఆయన తీర్చునని తెలిపారు. తెనాలికి చెందిన పాస్టర్ జాన్ వెస్లీ క్రీస్తుని సందేశాన్ని భక్తులకు అందజేశారు. దేవుని నామాన్ని ఘనపరిచేందుకు, ఆయన పరిచర్య చేసేందుకు ఆయన నిన్ను బతికించాడని చెప్పారు. ఆయన యందు నమ్మిక కలిగిన వారికి రక్షణ కలుగునని తెలిపారు. దేవుని సన్నిధిలో సమాధాన మనస్సుతో ఆయన యందు ఉండేందుకు సిద్ధపడాలని సూచించారు. మదనపల్లికి చెందిన పాస్టర్ రాజశేఖర్ క్రీస్తుని సందేశాన్ని భక్తులకు అందజేస్తూ క్రీస్తుని భక్తులు పచ్చని అంజూరపు చెట్టువలే ఫలించాలని తెలిపారు. అంజూరపు పండ్లు ఆరోగ్యాన్ని అందిస్తాయని, అదే విధంగా ఆయన భక్తులు మంచిని పంచాలని చెప్పారు. మూడో రోజు ప్రత్యేక ప్రార్థనలకు దేశంలోని వివిధ దేశాలకు చెందిన క్రీస్తు భక్తులు నాలుగు లక్షలకు పైగా పాల్గొన్నారు. భక్తులకు భోజన వసతి సౌకర్యాల్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఆదివారం మధ్యాహ్నంతో గడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలు ముగియనున్నట్లు తెలిపారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: బంధువునంటూ ఓ వ్యక్తి ఫోన్ చేసి రూ. 30వేలు మోసం చేసి తీసుకున్నాడని బాధితులు నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శివరామ్‌నగర్ 1వలైనులో నివశించే సురేష్‌బాబుకు ఓ వ్యక్తి ఫోన్ చేసి మీ బంధువు సాయినంటూ పరిచయం చేసుకున్నాడు. రూ.30వేలు అత్యవసరమైందని, తాను మాట్లాడుతున్న సెల్‌నంబరుకు పంపించాలని చెప్పాడు. సురేష్‌బాబు నమ్మి రూ.30వేలు పంపాడు. అగంతకుడు మళ్లీ ఫోన్ చేసి రూ.20వేలు అగడంతో సురేష్‌బాబుకు అనుమానం వచ్చి బంధువులను విచారించి మోసపోయినట్లు గుర్తించాడు. అగంతకుడు మిర్చి యార్డు సమీపంలోని ఓ పెట్రోలు బంకులో పనిచేసే ఉద్యోగిని సెల్ సహాయం అడిగి ఈ మోసం చేసినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సిబ్బంది మెరుగైన సేవలందించాలి

గుంటూరు ఈస్ట్: ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని విద్యుత్ శాఖ సబ్ స్టేషన్‌లో శనివారం లైన్‌మెన్ దివస్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హెచ్.ఖాన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లైన్‌మెన్‌లు విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. లైన్‌మెన్‌లు భద్రత చర్యలు పాటించాలన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. విద్యుత్ శాఖకు పేరు తేవాలన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న ఫించన్ల పంపిణీ



నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుక నాలుగో రోజు జిల్లాలో లబ్ధిదారులకు వలంటీర్లు శనివారం అందజేశారు. గుంటూరు జిల్లాలో నాలుగో రోజు 98.70 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,53,237 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.69.59 కోట్లు కేటాయించింది. శనివారం సాయంత్రానికి 2,49,933 మంది లబ్ధిదారులకు రూ.68.66 కోట్ల నగదు అందజేశారు.

త్వరితగతిన గృహాలు నిర్మించుకోవాలి

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివరామిరెడ్డి



ఫిరంగిపురం: జగనన్న కాలనీల్లోని లబ్ధిదారులు త్వరితగతిన గృహనిర్మాణాలు పూర్తి చేసుకోవాలని స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్ శివరామిరెడ్డి అన్నారు. మండలంలోని నుదురుపాడు గ్రామంలో జగనన్నకాలనీలోని రెండు లేఅవుట్ల గృహాల లబ్ధిదారులతో శనివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండులేఅవుట్లలో 72గృహాలు మంజూరుకాగా వాటిలో 23 గృహాలు వివిధదశల్లో నిర్మాణంలో ఉన్నాయని మిగిలిన వారు త్వరితగతిన గృహనిర్మాణాలు మొదలు పెట్టాలన్నారు. ఇప్పటికే కాలనీలో విద్యుత్ సౌకర్యం, తాగునీటి సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. మిగిలిన గృహాల నిర్మాణాలు పూర్తి అయితే రోడ్డు సౌకర్యం, డ్రెయినేజీ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. రాష్ట్రప్రభుత్వం జగనన్న కాలనీలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని లబ్ధిదారులు దీనిని గమనించి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ పద్మనాభుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వరరావు, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, ఏపీఎం సుజాత, సర్పంచ్ గొట్టం, నాగమల్లేశ్వరి, గ్రామపెద్దలు కె.అప్పిరెడ్డి, చౌడయ్యలు పాల్గొన్నారు.

వైభవంగా మహా రుద్రయాగం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):లోక కళ్యాణార్థం ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిర్వహిస్తున్న శత చండీ సహిత మహా రుద్రయాగం మూడో రోజుకు చేరుకుంది. శనివారం మూడో రోజున ఉదయం రుద్రహవనం, చండీ హోమం, మూల మంత్ర హవనం, నిత్యా ర్చనలు నిర్వహించారు. ఆలయ వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో రుత్వికులు చండీహోమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం మల్లేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు చేశారు. యాగశాలలో దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. భక్తులు యాగాన్ని వీక్షించేలా దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, బచ్చు మాధవీకృష్ణ, మారం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏప్రిల్ 2న జీతే రన్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విశ్వశాంతిని కాంక్షిస్తూ జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ రెండో తేదీన జీతే రన్ (అహింస మారథాన్) నిర్వహిస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అహింస మారథాన్ వాల్ పోస్టర్‌ను శనివారం తన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ విశ్వశాంతిని కోరుతూ ప్రపంచ వ్యాప్తంగా పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఆర్గనైజేషన్ విజయవాడ చాప్టర్ చీఫ్ సెక్రటరీ మనీష్ దోషి మాట్లాడుతూ.. అహింస రన్‌లో పాల్గొనదలచిన ఔత్సాహికులు పేర్లను నమోదు చేసుకోవాని సూచించారు. మరిన్ని వివరాలకు 94402 80906 సెల్ నంబరులో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ చైర్మన్ అశోక్ గోలీపా, మహిళా విభాగం చైర్మన్ తృప్తి జైన్, చీఫ్ సెక్రటరీ సంగీత సీనావర్త్, మీడియా కో ఆర్డినేటర్ ప్రవీణ్ రంత, జైన్ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

గజవాహనాధీశా... పాహిమాం...




గజవాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిస్తున్న అభయప్రదాత. స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

మంగళగిరి: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహోత్సవాలలో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు శనివారం ఉదయం హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. హంసవాహన ఉత్సవ విశిష్టత ఏమనగా పాలను నీటిని వేరుచేసే స్వచ్ఛమైన పాలను గ్రోలు హంస భక్తుల పాపాలను వేరుచేసి పుణ్యాత్ములుగా చేయునని నమ్మకం. పరమహంసను అధిరోహించిన శ్రీ నరసింహ పరమహంస దర్శనం మహాపుణ్యఫలం. రాత్రి గజవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీవారు గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమివ్వగా అశేషసంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకుని ముగ్ధులయ్యారు. ఉత్సవ విశిష్టతలోకి వెలితే భోజనానంతరం గజాంతం ఐశ్వర్యం అని శాస్త్రం. సర్వైశ్వర్య ప్రదాతయైన స్వామి గజవాహన మహోత్సవం, స్వామి తనని రక్షించాడనే కృతజ్ఞతతో గజరాజు స్వామి వారికి వాహనమయ్యాడు. గజం అష్ట మంగళములలో ఒకటి. గజవాహనారూఢుడైన శ్రీ స్వామి వారిని దర్శించిన స్వామి అష్ట ఐశ్వర్యములు కలుగజేస్తారని ప్రతీతి. గజేంద్రమోక్షంలో స్వామి వారు అమ్మవారికి చెప్పక, శంకు చక్రములు ధరింపక, ఏ పరివారంబును బూనక గజేంద్రుని రక్షించుటకై ఆర్తత్రాణ పరాయణుడై శ్రీమన్నారాయణుడు వైకుంఠం వీడి మొసలి బారి నుంచి గజేంద్రుని రక్షించి మోక్షము ప్రసాదించారు. అంతటి విశిష్టతను సంతరించుకున్న గజవాహన ఉత్సవాన్ని దర్శించిన వారికి మొసలి బారి నుంచి తన భక్తుడైన గజేంద్రుని రక్షించిన విధముగా సంసారమనే మొసలి బారి నుంచి తమ భక్తులను కాపాడి రక్షించి ముక్తిని, మోక్షాన్ని శభాలను కలుగుజేస్తారని శాస్త్రం చెబుతుంది. ఉత్సవాలను ఆలయ ఈవో ఎ.రామకోటి రెడ్డి పర్యవేక్షించగా హంసవాహన సేవ కైంకర్యపరులుగా వేదాంత గోపాల సత్యవతి, వేణుగోపాల వాసుదేవ భట్టర్‌లు, గజవాహన సేవ కైంకర్యపరులుగా పాతమంగళగిరి శ్రీ పద్మశాలీయ సంఘం వారు వ్యవహరించారు. ఈ సందర్భంగా రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు సాంస్కృతిక కళావేదికలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, నృత్య ప్రదర్శన అలరించాయి.

నేడు పొన్నవాహన ఉత్సవం

బ్రహ్మోత్సవాలల్లో భాగంగా ముఖ్య ఉత్సవమైన స్వామి వారు ఆదివారం ఉదయం కల్పవృక్షవాహనం, రాత్రి పొన్నవాహన మహోత్సవం జరుగుతుందని ఈవో తెలిపారు. భక్తులు ఉత్సవంలో పాల్గొని స్వామి వారిని దర్శించకుని స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

సాంస్కృతిక కార్యక్రమాలతో మానసిక ఉల్లాసం



క్యారమ్స్ పోటీల్లో ఉద్యోగినులు, పర్యవేక్షిస్తున్న ఘంటసాల శ్రీనివాసరావు, సతీష్‌కుమార్

గుంటూరుమెడికల్: సాంస్కృతిక కార్యక్రమాలతో మానసిక ఉల్లాసం కలుగుతోందని, కళలతో ప్రతి ఒక్కరిలో అంతర్లీనంగా ఉండే ప్రతిభ వెలుగులోకి వస్తోందని ఏపీ ఎన్జీవో గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గుంటూరు ఏపీ ఎన్జీవో హోం శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి ముఖ్య అతిథిగా విచ్చేసి గీతాలు ఆలపించి అందరిని సంభ్రమాశ్చర్యాలకు గురిచేశారు. తనకు పాటలు పాడడం ఎంతో ఇష్టమని, సంగీతంతో మనస్సుకు ప్రశాంతత చేకూరుతోందని డాక్టర్ ప్రభావతి వెల్లడించారు.

ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలకు సాంస్కృతిక కార్యక్రమాలపై ఎక్కువ మక్కువ ఉంటుందని, కానీ వారు కుటుంబ బాధ్యతల వల్ల వాటిపై ఎక్కు వ దృష్టి సారించలేకపోతున్నారని వెల్లడించారు. జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సతీష్‌కుమార్ మాట్లాడుతూ రెండు రోజులపాటు అసోసియేషన్ హాలులో నిర్వహించిన పోటీల్లో విజేతలకు మహిళ దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామన్నారు.



బ్రహ్మానందంను సత్కరిస్తున్న చైర్మన్ కోనేరు సత్యనారాయణ, వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ

చదువుకు పేదరికం అడ్డుకాదు

సినీనటుడు డాక్టర్ బ్రహ్మానందం

తాడేపల్లిరూరల్: చదువుకు పేదరికం అడ్డు కాదని సినీ నటుడు బ్రహ్మానందం అన్నారు. శనివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కె.ఎల్.విశ్వ విద్యాలయంలో జరిగిన సమ్యక్ వార్షిక వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. డాక్టర్ బ్రహ్మానందం, ఐఏఎస్ అధికారిణి నిధి మీనాలను కేఎల్‌యూ చైర్మన్ కోనేరు సత్యనారాయణ సాదరంగా ఆహ్వానించారు. కుంచనపల్లి ప్రాతూరు రోడ్ వద్ద అభిమానులు పెద్ద సంఖ్యలో చేరుకుని బ్రహ్మానందంకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తాను నిరుపేద కుటుంబంలో జన్మించానని, చిన్నతనంలో ఎన్నో ఇబ్బందులను అధిగమించానని అన్నారు. పేదరికాన్ని ద్వేషించవద్దని, పేదరికాన్ని ప్రేమించండి అది మీకు జీవితంలో ఎన్నో పాఠాలను నేర్పుతుందన్నారు. విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకుండా పలు కార్యక్రమాల్లో పాల్గొని తమ నైపుణ్యాలను వెలికి తీసుకోవాలని సూచించారు.

అనంతరం చైర్మన్ కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ తమ విశ్వవిద్యా లయం అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో పోటీ పడుతోందన్నారు. విద్యార్థులకు సులభరీతిలో బోధనా పద్ధతులను పాటించడం వలన విదేశాలలో సైతం తమ విద్యార్థులు ఇంటర్నషిప్‌లు పొందడంతో పాటు విదేశాలలో ఉద్యోగాలను సాధిస్తున్నారన్నారు. పరిశోధనలో అంతర్జాతీయ స్థాయిలో కొన్ని వందల జర్నల్స్‌ను ముద్రించడంలో కె.ఎల్.యు రికార్డులు సృష్టించిందని అన్నారు. మహిళా ఫోరంతో పాటు స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ద్వారా స్మార్ట్ విలేజ్, రెడ్ క్రాస్, ఎన్‌సిసి, ఎన్ఎస్.ఎస్. హాబీ క్లబ్, వ్యవసాయ క్లబ్, సైబర్ క్లబ్, కోడింగ్ క్లబ్ వంటి సుమారు 30 విద్యార్థి విభాగాల క్లబ్‌లు విశ్వవిద్యాలయంలో నడుస్తున్నాయన్నారు. సమ్యక్ వేడుకలలో భాగంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రో చాన్సలర్ డాక్టర్ కె.ఎస్. జగన్నాథరావు, వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీ డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, అకడమిక్ డీన్ డాక్టర్ వేగే హరికిషన్, విద్యార్థి వ్యవహారాల డీన్ ఎ. శ్రీనాథ్, ఉద్యోగాల కల్పన డీన్ డాక్టర్ ఎన్.బి.కె. ప్రసాద్, పరిశోధనల అభివృద్ధి డీన్ జయకుమార్ సింగ్, డీన్ పిఎన్‌డి డాక్టర్ రాజేష్, అధ్యాపకుల వ్యవహారాల డీన్ శ్రీకాంత్, క్వాలిటీ డీన్ రామకృష్ణ, ఎంహెచ్‌ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జె. శ్రీనివాస్, పరిశోధనల డైరెక్టర్ డాక్టర్ శరత్‌కుమార్, అన్ని విభాగాల ప్రిన్సిపల్స్, విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పవిత్ర దేవాలయాలు గ్రంథాలయాలు



గుంటూరు జిల్లా గ్రంథాలయంలో పుస్తకాలపై బూజు దులుపుతున్న ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

- విద్యార్థులకు విజ్ఞానం, నిరుద్యోగులకు ఉపాధి కల్పించే కార్ఖానాలు
- ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి
- మనం–మన గ్రంథాలయం కార్యక్రమానికి శ్రీకారం
- జిల్లా గ్రంథాలయాన్ని శుభ్రపర్చిన అప్పిరెడ్డి, శేషగిరిరావు, దేవానంద్

గుంటూరు ఎడ్యుకేషన్: హిందువులకు ఆలయాలు, ముస్లింలకు మసీదులు, క్రైస్తవులకు చర్చిలు ఎంత పవిత్రమైనవో, కులమతాలకు అతీతంగా ప్రజలందరి ఉమ్మడి పవిత్ర దేవాలయాలు గ్రంథాలయాలని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. 'మనం–మన గ్రంథాలయంలో భాగంగా ప్రతినెలా మొదటి శనివారం గ్రంథాలయాలను శుభ్రపరిచే కార్యక్రమానికి అరండల్‌పేటలోని జిల్లా గ్రంథాలయంలో శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, డిప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీలతో కలిసి ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి జిల్లా గ్రంథాలయాన్ని పరిశుభ్రం చేసే కార్యక్రమంలో స్వయంగా భాగస్వాములయ్యారు. అనంతరం అప్పిరెడ్డి మాట్లాడుతూ ఆలయాల్లో ఆధ్యాత్మికత వెలుగులు విరబూస్తే, గ్రంథాలయాల్లో జ్ఞానకాంతులు వెల్లివిరుస్తాయన్నారు. ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన తొలి రోజు నుంచే రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు నడుం బిగించారని, పేదరికం సమూలంగా సమసిపోవాలంటే అందరూ విద్యావంతులు కావాలన్న వాస్తవాన్ని గుర్తించి విద్యారంగానికి అధిక ప్రాధాన్యత కేటాయించినట్లు తెలిపారు. అందులో భాగంగానే ఆయన గ్రంథాలయ వ్యవస్థను పటిష్టంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ సీఎం ఆలోచనా విధానానికి అనుగుణంగా గ్రంథాలయాల అభివృద్ధికి పాటుపడుతున్నామని, అందులో భాగంగా మనం- మన గ్రంథాలయం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ మాట్లాడుతూ మనం–మన గ్రంథాలయం అనే కార్యక్రమం పేరులోనే ప్రజల్లో ఇది మనది అనే మంచి ఆలోచన మొలకెత్తుతుందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీవల్లి, బూసి రాజలత, ఈచంపాటి వెంకటకృష్ణ, మోతుకూరి వెంకటరత్నం, జిల్లా గ్రంథాలయ ఇన్‌ఛార్జ్ కార్యదర్శి జాన్సీలక్ష్మి, డీడీ శ్రీనివాసరెడ్డి, ఏడీ దీక్షితులు, సీనియర్ అసిస్టెంట్ సీతారామయ్య, వైఎస్సార్ సీపీ నేతలు బందా రవీంద్రనాద్, సూర్యదేవర రమేష్, గనిక జాన్సీ పాల్గొన్నారు.

పరిశోధన పత్రాల ప్రచురణకు గ్రాంటు మంజూరు

- రెక్టార్ పి. వరప్రసాదమూర్తి వెల్లడి
- ముగిసిన జియాలజీ జాతీయ సదస్సు



సమావేశంలో ప్రసంగిస్తున్న రెక్టార్ వరప్రసాద మూర్తి, వేదికపై సదస్సు డైరెక్టర్ రత్నాకర్

ఏఎన్‌యూ: జాతీయ సదస్సుల్లో సమర్పించిన ఉత్తమ పరిశోధన పత్రాల్ని ప్రచురించేందుకు గ్రాంటు మంజూరు చేస్తామని రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జియాలజీ విభాగం ఆధ్వర్యంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ జియోసైన్సెస్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ (ఆర్‌టీజీఎస్–2023) అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన రెక్టార్ వరప్రసాదమూర్తి ప్రసంగిస్తూ మంచి పరిశోధన పత్రాలు ప్రచురించే ఎడిటోరియల్ బోర్డుకు యూజీసీ సమన్వయకర్తగా డాక్టర్ రత్నాకర్ సంపాదకులుగా వ్యవహరిస్తారన్నారు. ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. యూనివర్సిటీ కళాశాలల్లోని అన్ని విభాగాలకు సదస్సులు నిర్వహించడానికి సమానంగా నిధులు మంజూరు చేస్తున్నామని వెల్లడించారు. సదస్సు డైరెక్టర్, జియాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.జె.రత్నాకర్ అధ్యక్షోపన్యాసం చేస్తూ రెండు రోజులపాటు జరిగిన సదస్సులో దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి విశ్వవిద్యాలయాలు, జియాలజీ రంగ సంస్థల నుంచి నిపుణులు, అధ్యాపకులు, పరిశోధకులు కీలకోపన్యాసాలతో పాటు పరిశోధన పత్రాలు సమర్పించారని తెలిపారు. హైదరాబాద్ ఎన్‌జీఆర్ఐ(నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) విశ్రాంత ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ వి. బలరామ్ ప్రసంగిస్తూ ఏఎన్‌యూ జియాలజీ విభాగంలో ప్రయోగశాలలు, మ్యూజియం విద్యార్థులకు, పరిశోధకులకు ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. ప్రతి ఏడాది రెండు జాతీయ సదస్సులు నిర్వహిస్తే విద్యార్థులలో నైపుణ్య లక్షణాలు పెరుగుతాయని తెలిపారు. వారణాసి బెనారస్ హిందూ యూనివర్సిటీ అధ్యాపకుడు ఆచార్య ఎన్.వి.చలపతిరావు ప్రసంగిస్తూ జియాలజీ సబ్జెక్టుకు సంబంధించిన అంశాలపై ఆన్‌లైన్ కోర్సులు నిర్వహిస్తే మరింత మంది ప్రయోజనం పొందుతారని చెప్పారు.కార్యక్రమంలో జియాలజీ విభాగ అధ్యాపకులు నాగేశ్వరరావు, ఇశ్రాయేలు, పలువురు అధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

అభివృద్ధే వైఎస్సార్ సీపీ లక్ష్యం

- కులాలు అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదు
- జనసేన ఆవిర్భావ దినోత్సవానికి, తొలగింపునకు నంబంధమే లేదు
- ఇక రాజకీయ కక్షలు ఎక్కడ ఉంటాయి?
- లోకేష్ గెలుపు కోసమే గ్రామాల్లో చిచ్చు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్: అభివృద్ధి చేయడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని గ్రామాల్లో కులాల మధ్య, మతాల మధ్య చిచ్చుపెట్టే పార్టీలు ఏమిటో ఇప్పటికే ప్రజలకు అర్థమైందని వైఎస్సార్ సీపీ నాయకులు, ఇప్పటం వాసులు వెల్లడించారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నిర్మించిన ప్రహరీలు, కారిడార్లు మాత్రమే తొలగిస్తున్నారని, ఏ ఒక్కరి భూమిలోకి అంగుళం కూడా వెళ్లి తొలగించడం లేదన్నారు. శనివారం ఇప్పటంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా కొంతమంది నివాసాల చుట్టూ ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నిర్మించుకున్న ప్రహరీలు, మెట్లు, కారిడార్లు తొలగించే కార్యక్రమాన్ని ఎంటీఎంసీ అధికారులు చేపట్టారు. వెంటనే అక్కడకు చేరుకున్న జనసేన నాయకులు ఇప్పటంలో పేదల ఇళ్లు తొలగిస్తున్నారని దుష్ప్రచారం చేయడంతో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, మున్నంగి వివేకానందరెడ్డి గ్రామస్తులతో కలసి విలేకరులకు వెల్లడించారు.

ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి

నియోజకవర్గంలో మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టారని, ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధిపై ఏ పార్టీ వారు అయినా బహిరంగ చర్చకు వస్తే నిరూపిస్తామని వారు అన్నారు. ఇప్పటంలోనే ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారి ప్రహరీలు, మెట్లు, కారిడార్లు మాత్రమే తొలగించారని, ఇళ్లను తొలగించలేదన్నారు. ఆత్మకూరు, నూతక్కి, నవులూరు తదితర ప్రాంతాల్లో కూడా ప్రభుత్వ భూములు, రోడ్డు మార్జిన్‌లు ఆక్రమించుకున్న ఇళ్లను సైతం తొలగించారని, అందులో అర్హులైన ప్రతి ఒక్కరికీ నివాస స్థలాన్ని కేటాయించారని స్పష్టం చేశారు. ఆక్రమణలు తొలగించిన ప్రతి ఒక్కొక్కచోటా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఆక్రమణలు తొలగించిన ప్రాంతాల్లో కూడా అన్ని కులాల వారు ఉన్నారని, ఇప్పటంలో కాపు సామాజిక వర్గం ఎక్కువగా ఉండడంతో అన్నదమ్ముల్లా ఉన్నటువంటి గ్రామాల్లో చిచ్చు పెట్టేందుకు చంద్రబాబు నాయుడు, లోకేష్‌లు కుట్ర పన్నారు. ఎలాగైనా ఎమ్మెల్యే ఆర్కేను ఓడించాలని ఉద్దేశ్యంతోనే ఇక్కడ ఉన్న కొంతమంది స్వార్థ పరులతో కలసి తమకు టిల రాజకీయాల కోసం జనసేన అధినాయకుడు పవన్ కల్యాణ్‌ను తప్పుదోవ పట్టించారని, చివరకు కోర్టుకు వెళ్లిన వారికి కోర్టు మొట్టికాయలు వేసి లక్షల రూపాయలు అపరాధ రుసుం వేయడంతోనే దాని వెనుక ఎటువంటి రాజకీయాలు చేస్తున్నారో అర్థమవుతుందన్నారు.

ఇప్పటంలో 56 అక్రమ కట్టడాలను తొలగిస్తుంటే అందులో ఒక్కరు కూడా పవన్ కల్యాణ్ సభకు స్థలం ఇవ్వలేదని, ఇచ్చారని నిరూపిస్తే మేం రాజకీయాలు వదిలేస్తామని సవాల్ విసిరారు. ఇప్పటం గ్రామంలో ఇప్పటికే ప్రభుత్వం మూడు కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టిందని, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంగళగిరి నియోజక వర్గానికి ఇచ్చిన స్పెషల్ గ్రాంట్ నుంచి మరో 6 కోట్లు కేటాయించి అభివృద్ధి చేస్తుంటే ఆ అభివృద్ధిని అడ్డుకోవడానికి ఒకతను తన కులాన్ని అడ్డం పెట్టుకుని జనసేనకు మద్దతు పలికామని, మీటింగ్‌కు పొలాలు ఇచ్చామని ఇళ్లు కూలుస్తున్నారంటూ ప్రచారం చేయడం ఎంతవరకు న్యాయమో ఆ జనసైనికులే చెప్పాలని వారు సూటిగా ప్రశ్నించారు. ఇప్పటికే ఇప్పటంలో తొలగించిన ప్రాంతాల్లో పక్కా డ్రైన్లు నిర్మించి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామని, 1952లో నిర్మించిన బావిని, రాముల వారి గుడిని స్వచ్ఛందంగా తొలగించి అభివృద్ధికి సహకరిస్తుంటే ఒకరిద్దరు గ్రామాల్లో చిచ్చుపెట్టి కులాలను రెచ్చగొట్టి పచ్చని గ్రామాల్లో చిచ్చుపెట్టడం వెనుక ఎంత రాజకీయం ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు.

ఈ సమావేశంలో మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ బ్రహ్మంగ రెడ్డి, లచ్చి తులసిదాసు, హరిబాబు గౌడ్ గాజుల లక్ష్మీ నారాయణ (చిన్న), లక్కాకుల రమేష్, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా గుంటూరు జిల్లా కన్వీనర్ మేకా వెంకట రామిరెడ్డి, వడ్డేశ్వరం బీసీసెల్‌నాయకులు కత్తిక మల్లికార్జునరావు (బుల్లబ్బాయి), కొలనుకొండ పార్టీ కన్వీనర్ నూతక్కి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంచ సూత్రాలతోనే ఉన్నత స్థానం

- జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి
- ఘనంగా ప్రారంభమైన జాతీయస్థాయి విజ్ఞాన్ నిరులోత్సవ్–2కే23
- 15వేల మందికి పైగా హాజరైన విద్యార్థులు



పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ జి రాజకుమారి, నరసాపురం సబ్‌కలెక్టర్ ఎం సూర్యతేజ, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరురూరల్: పంచ సూత్రాలైన వస్త్ర సౌందర్యం, ముఖ వర్చస్సు, మాట తీరు, విద్య, వినయంలను సరైన దిశలో వినియోగిస్తే జీవితంలో మీరు అనుకున్న ఉన్నత స్థానాలను సులభంగా అధిరోహించగలరని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. గుంటూరు రూరల్ మండలం పలకలూరులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రెండురోజులపాటు నిర్వహించే జాతీయస్థాయి టెక్నికల్, కల్చరల్, ఫైన్ ఆర్ట్స్, లిటరరీ, స్పోర్ట్స్ ఫెస్ట్ నిరులోత్సవ్–2కే23 ఘనంగా ప్రారంభమైంది. జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు బుద్ధితోపాటు మనసును కూడా లగ్నం చేస్తేనే జ్ఞానాన్ని సంపాదించుకోగలరని పేర్కొన్నారు. నాయకత్వ లక్షణాలు, టీమ్ స్పిరిట్, క్రమశిక్షణ, నాలెడ్జ్, రెస్పాన్సిబిలిటీ, ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ఎప్పుడూ సమూహంలో ఒకడిగా ఉండకుండా పది మందికి దారి చూపే దిశలో ఎదగాలన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే మహిళల పాత్రతోనే సాధ్యమన్నారు. ఏ సెక్టార్‌నైనా లీడ్ చేసే లక్షణాలను విద్యార్థినులు పెంపొందించుకోవాలన్నారు.

విల్ పవర్‌తో విజయాలు సాధ్యం

విద్యార్థులు ఏదైనా లక్ష్యాన్ని సాధించాలని దృఢ సంకల్పంతో నిశ్చయించుకుని విల్ పవర్‌తో కష్టపడితే సాధించలేనిదంటూ ఏదీ ఉండదని విజ్ఞాన్స్ పూర్వ విద్యార్థి, నరసాపురం జిల్లా సబ్ కలెక్టర్ ఎం సూర్యతేజ అన్నారు. విజ్ఞాన్ మహోత్సవ్ కార్యక్రమంలో యాంకరింగ్ చేసిన నేను... ఈ రోజు అదే కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరవడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు ఏదైనా పనిలో నూరు శాతం ఎఫర్ట్ పెడితేనే విజయం లభిస్తుందన్నారు.

మీ విజయమే నాకు సంతోషం

విద్యార్థులు జీవితంలో మంచి ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థానాలను అధిరోహిస్తే... మీకంటే నేనే ఎక్కువగా సంతోషపడతానని విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. లైఫ్ స్కిల్స్, టీమ్ స్పిరిట్, కమ్యూనికేషన్ స్కిల్స్, మేనేజ్‌మెంట్ స్కిల్స్ వంటివి క్లాస్‌రూమ్‌తోపాటు ఆటల్లో ఎక్కువగా పాల్గొనే విద్యార్థుల్లో త్వరగా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఇలాంటి ఉత్సవాల్లో ఎవరైతే ఎక్కువగా పాల్గొంటారో వాళ్లే క్యాంపస్ ఇంటర్వ్యూల్లో మొదట ఉద్యోగాలు సాధిస్తారని వెల్లడించారు.

39 విభాగాల్లో పోటీలు

విజ్ఞాన్ నిరులోత్సవ్ జాతీయ ఉత్సవాల్లో భాగంగా మొత్తం 39 అంశాల్లో పోటీలు ప్రారంభించారు. నిరులోత్సవ్–2కే23 సంబరాల్లో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా అలరించాయి. కళాకారులు పలు నృత్య రూపకాలకు అనుగుణంగా నర్తించి మంత్రముగ్ధుల్ని చేశారు. ముఖ్యంగా జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఓలలాడించాయి. అనంతరం ముఖ్య అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పాతూరి రాధిక, కన్వీనర్ డాక్టర్ వి.సుజాత, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సాక్షి గుంటూరు

ఆదివారం । 5 । మార్చి । 2023



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6,000, గరిష్ట ధర రూ.8,300, మోడల్ ధర రూ.7,000 వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 545.10 అడుగుల వద్ద ఉంది. ఇది 199.1162 టీఎంసీలకు సమానంగా ఉంది.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: గుంటూరు జిల్లా వ్యాప్తంగా శనివారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. అలాగే జిల్లాలో మరణాలు కూడా ఎక్కడా లేవని వైద్య వర్గాలు తెలిపాయి.

న్యూస్‌రీల్

జెడ్పీ పాఠశాలల్లో ఆర్జేడీ తనిఖీలు

14మంది ఉపాధ్యాయులకు చార్జి మెమోలు



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు జిల్లా పరిషత్ హైస్కూల్, ఎంపీయూపీ, అల్లంవారిపాలెంలోని జిల్లా పరిషత్ పాఠశాలలను ఆర్జేడీ వై.సుబ్బారావు, డీఈఓ పి.శైలజలు శనివారం ఆకస్మిక తనిఖీచేశారు. వర్క్ పుస్తకాలు, పూర్తి అయిన సిలబస్ వివరాలతోపాటు విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పంపిణీ, మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌ల వాడకం వంటి పలు అంశాలను వారు పరిశీలించారు. వర్క్‌బుక్‌లో భాగంగా ప్రతి పేజీని పరిశీలించినదీ లేనిది గమనించి ఉపాధ్యాయుల పనితీరుపై అసహనం వ్యక్తంచేశారు. గతంలో ఆయా పాఠశాలల్లో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సైతం పూర్తిస్థాయిలో సిలబస్ బోధించడంకాని, నోట్‌పుస్తకాలు దిద్దడంకాని, విద్యార్థులచే ట్యాబ్‌లు వాడించడం, వారు వాడటంకాని చేయకపోవడంతో 14మంది ఉపాధ్యాయులకు చార్జి మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. నుదురుపాడు, అల్లంవారిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలల హెచ్‌ఎంలతో సహా ఐదుగురు స్కూల్ అసిస్టెంట్లు, ఐదుగురు ఎస్జీటీలు, మరో ఇద్దరు ఉపాధ్యాయులు కలిపి 14 మందికి చార్జీ మెమోలు జారీ చేస్తున్నట్లు డీఈఓ పి.శైలజ ఆదేశాలిచ్చారు. వారి వెంట ఎంఈఓ సాల్మన్‌రాజు ఉన్నారు.

హోంగార్డు కుటుంబానికి రూ.10లక్షల చెక్కు అందజేత



నగరంపాలెం: గతేడాది జూన్ 16న ప్రత్తిపాడు పీఎస్ పరిధిలో రాత్రి విధులు నిర్వహిస్తున్న హోంగార్డు ఎం.కల్యాణ్ లారీ ప్రమాదంలో మృతి చెందాడు. ఈ క్రమంలో డీజీపీ ప్రధాన కార్యాలయం నుంచి అతడి కుటుంబానికి రూ.10 లక్షల బీమా మంజూరు అయింది. చెక్కుని కల్యాణ్ భార్య జ్యోత్స్నకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అందించారు. కార్యక్రమంలో జిల్లా హోంగార్డు యూనిట్ ఆర్‌ఐ రమేష్ కృష్ణన్ పాల్గొన్నారు.

ఉగాది నాటికి నిర్మాణాలు పూర్తిచేయాలి

బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



అద్దంకరూరల్: ఉగాది పండగ నాటికి జగనన్న లేఅవుట్లలోని గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని బాపట్ల కలెక్టర్ కే విజయకృష్ణన్ అన్నారు. మండలంలోని గోపాలపురం గ్రామంలోని జగనన్న అవుట్లను కలెక్టర్ శనివారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి ముందుగా రూ. 35 వేలు అందజేస్తుందని, లబ్ధిదారులు వినియోగించుకోవాలన్నారు. జగనన్న కాలనీలో మౌలిక వసతుల ఏర్పాటు ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. ఉద్యోగులు లబ్ధిదారులకు నిర్మాణాలు చేపట్టేలా అవగాహన కల్పించాలన్నారు. లక్ష్యాలు పూర్తిచేయటానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర శాప్ నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బీ కృష్ణచైతన్య, అధికారులు పాల్గొన్నారు.

పోలీసు అలర్ట్

ఇద్దరు వాచ్‌మెన్‌ల హత్య నేపథ్యంలో...

- అనుమానితులపై నిఘా
- నైట్ బీట్లు, పెట్రోలింగ్ పటిష్టం
- రాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు
- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గస్తీ పెంపు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లాలో అనుమానితులపై నిఘా పెట్టాలని పోలీసు శాఖ నిర్ణయించింది. రెండురోజుల కిందట గుంటూరు నగరంలో నేర చరిత్ర ఉన్న ఇద్దరు మైనర్లు విధ్వంసం సృష్టించి ఇద్దరు వాచ్‌మెన్లను హత్య చేసిన నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తం అయ్యింది. సస్పెక్ట్ షీటర్లు, కేడీ షీటర్లు, రౌడీషీటర్లపై నిఘా పెంచనున్నారు. ప్రతిరోజూ రాత్రి సమయంలో వారు ఎక్కడ ఉన్నది ఆరా తీస్తారు. ఒకవేళ వారు ఊరు దాటి బయటకు వెళ్లే వారి లొకేషన్‌ను ట్రేస్ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించారు.

జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆకస్మికంగా వెస్ట్ సబ్‌డివిజన్ పరిధిలో ముఖ్యమైన ప్రాంతాలలో కాలినడకన పర్యటించారు. రాత్రి సమయంలో నైట్‌బీట్, పెట్రోలింగ్ సిబ్బంది ఏవిధంగా గస్తీ తిరుగుతున్నారనే విషయాన్ని ఆరా తీశారు.

ఇన్‌చార్జుల నియామకం

రాత్రి పూట గస్తీ నిర్వహించే విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా ఇప్పటి వరకూ నిర్వహిస్తున్న బీట్ వ్యవస్థను సమీక్షించి పూర్తిస్థాయిలో పకడ్బందీగా నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు. దీని ప్రకారం ప్రతి రోజూ రాత్రి సమయంలో ఒక అదనపు ఎస్పీ కేడర్ అధికారి గాని, డీఎస్పీ కేడర్ అధికారిగాని ఇన్‌చార్జిగా ఉంటారు. ప్రతి సబ్ డివిజన్‌కు ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ప్రతి స్టేషన్‌కు ఒక సబ్ ఇన్‌స్పెక్టర్ నైట్ బందోబస్తులో ఉండేలా ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లా పరిధిలో ఆరు సబ్ డివిజన్లకు ఆరుగురు సీఐలు, 28 స్టేషన్లకు 28 మంది ఎస్‌ఐలు ప్రతిరోజూ రాత్రి గస్తీలో ఉంటారు. ప్రతి స్టేషన్‌కు ఒక రక్షక్ వాహనంతోపాటు స్టేషన్‌ను బట్టి మూడు నుంచి ఐదు బీట్ బృందాలు రాత్రి గస్తీ కాస్తాయి. గస్తీ వాహనాలు ఎక్కడెక్కడ తిరిగాయన్నది చూడటానికి వాటికి జీపీఎస్ ట్రాకింగ్‌ను అమర్చనున్నారు.



నగరంలో శుక్రవారం రాత్రి తనిఖీలు చేస్తున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

10.30 గంటలకల్లా షాపులు మూత

రాత్రి 10.30 గంటలకల్లా అన్ని షాపులు మూయించేలా చూడాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. గుంటూరు సిటీతో పాటు పెదకాకాని, మంగళగిరి, తాడేపల్లి, పొన్నూరు, తెనాలి వంటి ప్రాంతాలలో అన్ని షాపులు సకాలంలో మూయించేలా చూసేందుకు ఒక్కో ఎస్‌ఐకి బాధ్యత అప్పగించనున్నారు. షాపులు మూయించడంతోపాటు రాత్రి 10.30 గంటలు దాటిన తర్వాత వచ్చే వాహనాలను కూడా తనిఖీ చేయనున్నారు. ప్రతిరోజూ రాత్రి ఒంటి గంట నుంచి రెండు గంటల మధ్య ప్రతి స్టేషన్ పరిధిలో ఏదో ఒకచోట వాహనాలను తనిఖీ చేస్తారు.

> **అనుమానితులు కనిపిస్తే స్టేషన్‌కే**
>
> ఇటీవల జరిగిన ఘటనల నేపథ్యంలో జిల్లాలో రాత్రి గస్తీని ముమ్మరం చేశాం. ముఖ్యంగా గుంటూరు నగరంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గస్తీ తిరగడంతో పాటు, నైట్ ఇన్‌చార్జిగా ఉండే అధికారులు తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించాం. పెట్రోలింగ్ తిరిగే సిబ్బంది అర్ధరాత్రి సమయాల్లో తిరిగే వారిని విచారించి అనుమానితులు ఎవరైనా ఉంటే వారి స్టేషన్ తీసుకొచ్చి విచారించి చట్టపరంగా చర్య తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశాం.
>
> – ఆరిఫ్ హఫీజ్, జిల్లా ఎస్పీ

ఇంటర్మీడియెట్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి చిత్రంలో జాయింట్ కలెక్టర్ రాజకుమారి

- కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి
- 15 నుంచి ఏప్రిల్ 4 వరకు పరీక్షలు
- 73 కేంద్రాలు... 58,602 అభ్యర్థులు

గుంటూరువెస్ట్: ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు జరగనున్న ఇంటర్మీడియేట్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం 73 పరీక్షా కేంద్రాల్లో 58,602 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 29,873, రెండో సంవత్సరం పరీక్షలకు 28,729 మంది హాజరుకానున్నారన్నారు. పరీక్షలకు సంబంధించి సందేహాలుంటే విద్యార్థులు ఆర్‌ఐఓ ఇంటర్మీడియేట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన టోల్ ఫ్రీ 0863–2228528 నెంబర్‌కు సంప్రదించాలని చెప్పారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారిని నియమించాలని చెప్పారు. ప్రశ్నపత్రాలు పరీక్షా కేంద్రాలకు చేరవేసిన దగ్గర్నుంచి మళ్లీ ఆన్సర్ షీట్స్ స్ట్రాంగ్ రూమ్స్‌లో భద్రపరిచే వరకు అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని చెప్పారు. పోలీసు శాఖ అవసరమైన సిబ్బందిని సమకూర్చాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఇన్విజిలేటర్లు అందుబాటులో లేకపోతే టీచర్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునేలా ఆర్టీసీ బస్సులు సమకూర్చాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, డీఈఓ శైలజ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సర్వశిక్షాభియాన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం


పిడుగురాళ్ల: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తోందని డీఈఓ ఎం.వెంకటప్పయ్య అన్నారు. పిడుగురాళ్లలోని ఎంఈఓ కార్యాలయ ప్రాంగణంలో సర్వశిక్షాభయాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య శిబిరాల నిర్వహణకు మండలానికి రూ.పదివేల చొప్పున కేటాయించిందని వివరించారు. జెడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య పాల్గొన్నారు.

ఆరోగ్యంపైనే.. ఆమె మమ'కారం'

ప్రజల ఆరోగ్యానికే ఆమె ప్రాధాన్యం. గృహిణిగా పచ్చళ్లు.. కారాల్లోనే భారతీయ ఆరోగ్యం ఉంటుందనేది నమ్మిన సిద్ధాంతం. వాటిని తన సేంద్రియ మమ'కారం' కలిపి తెలుగింటి భోజనానికి అందించాలనే అనసూయ ప్రయత్నం విజయవంతమైంది. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు విస్తృత అవగాహన కలిగిస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని అందిపుచ్చుకొని పచ్చళ్లను, కారప్పొడులను 'భీమా స్పైసెస్' పేరుతో విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు. పంట పొలం నుంచే తన ఉత్పత్తులను తానే ప్రమోట్ చేసుకుంటూ.. ఉభయతారక వ్యాపారాన్ని మరింత విస్తరిస్తానంటున్న నూతక్కికి చెందిన భీమిరెడ్డి అనసూయ విజయ కథనం. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు మహిళలకు స్ఫూర్తిమంతం కావాలని కాంక్షిస్తూ..

– తెనాలి

- సేంద్రియ ఆహార ఉత్పత్తులతో పచ్చళ్లు, కారప్పొడులు
- నోరూరించే వెజ్/నాన్‌వెజ్ పచ్చళ్లు సిద్ధం
- సాధారణ గృహిణి భీమిరెడ్డి అనసూయ వినూత్న ప్రయత్నం
- రెండున్నర ఎకరాల పొలంలో సొంతంగా పంటల సాగు..
- వెబ్‌సైట్ ద్వారా మార్కెటింగ్, దేశ, విదేశాలకు ఎగుమతులు



కొల్లిపర మండల గ్రామం తూములూరు గ్రామానికి చెందిన భీమిరెడ్డి అనసూయ చదివింది పదో తరగతి. పెళ్లి చేసుకుంది మంగళగిరి మండలం నూతక్కి గ్రామానికి చెందిన హరిమోహన్‌రెడ్డిని. భర్తకి తోడుగా.. సాధారణ గృహిణిగా సాగిపోతున్న ఆమెలో ఇంకేదో సాధించాలన్న తపన మొదలైంది. ప్రజల్లో పెరుగుతున్న ఆరోగ్య స్పృహ గమనించింది. తనకు తెలిసిన..పచ్చళ్లు, కారాల యూనిట్‌ను భీమా స్పైసెస్ పేరుతో నూతక్కిలో ప్రారంభించింది. అదీ తన సొంత వ్యవసాయ క్షేత్రంలో...

సాధారణంగా అందరిలాగే ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు, రుచికి రసాయనాలతో సాగు చేసిన పంట ఉత్పత్తులతో పచ్చళ్ల తయారు చేసుంటే భీమా స్పైసెస్‌కు పెద్దగా గుర్తింపు ఉండేంది కాదు. సేంద్రి ఉత్పత్తులతో పచ్చళ్లు, కారాల తయారీ కాన్సెప్ట్ అందరికీ నచ్చిఇంది. రెండున్నర ఎకరాల పొలంలో ఉల్లి, పుదీనా, కొత్తిమీర, కాకర, నిమ్మ, బత్తాయి, కరివేపాకు, టొమాటో, గోంగూర, కాకర వంటి పంటలను ఆమె స్వయంగా పండిస్తుంది. సొంతంగా చేసుకున్న సేంద్రియ ఎరువులను అందుకు వాడుతున్నారు. మధ్యప్రదేశ్ నుంచి ధనియాలు, కేరళ నుంచి యాలకులు, లవంగాలు, దాల్చిన చెక్క తీసుకొస్తారు. సత్తెనపల్లి దగ్గర గుడిపూడిలో ఎకరం విస్తీర్ణంలో రసాయన రహితంగా మిర్చి అందుబాటులోకి వచ్చింది. స్వచ్ఛమైన చెక్కగానుగ నూనె తీసేందుకు కోల్డ్ కంప్రెస్డ్ మిషనరీని, సంప్రదాయ రీతిలో కారం దంచేందుకు రోకళ్ల మిషను, తిరగలిని సమకూర్చుకున్నారు.



యూనిట్ వ్యవసాయ క్షేత్రం



రోకళ్ల మిషనుతో మిరప దంపుడు

అత్తమ్మ సహకారంతో..

పాకశాస్త్రంలో ప్రావీణురాలైన అత్త సామ్రాజ్యం సహకారంతో అనసూయ పచ్చళ్లు, కారాల తయారీలో నైపుణ్యం సాధించారు. కొత్తిమీర, పుదీనా, నిమ్మ, ఉసిరి, పండుమిర్చి, టమాటో అల్లం, గోంగూర పచ్చళ్ల తయారీ నేర్చుకుంది. ఇక కారాల విషయానికొస్తే కారం, కూరకారం, గొడ్డుకారం, నల్ల కారం, శనగపప్పు కారం, కరివేపాకు కారం, నువ్వుల కారం, మునగాకు కారం, కాకరకాయం కారం అందిస్తున్నారు. చికెన్ బోన్/ బోన్‌లెస్, చికెన్ గోంగూర, మటన్ బోన్‌లెస్, ప్రాన్స్, ప్రాన్స్ గోంగూర పచ్చళ్లలో ప్రావీణ్యత సాధించారు అనసూయ.

విదేశాలకు ఎగుమతి...



ఎగుమతికి సిద్ధంగా పచ్చళ్లు, కారాలు

మార్కెటింగ్ కోసం ఎవరిపైనా ఆధారపడకుండా భీమా స్పైసెస్.ఇన్ పేరుతో వెబ్‌సైట్‌ను ప్రారంభించారు అనసూయ. వాట్సాప్ గ్రూపులు, ఈ–మెయిల్స్‌లో ప్రమోట్ చేశారు. ఆశించిన ఫలితాన్ని సాధించారు. ఇప్పుడు పంటపొలంలోని యూనిట్ నుంచి పచ్చళ్లు, కారాలు పొరుగు రాష్ట్రాలైన కేరళ, హైదరాబాద్‌కే కాకుండా అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, ఇంగ్లండ్ దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు అనసూయ చెప్పారు. ప్రస్తుతానికైతే ఎలాంటి మధ్యవర్తులు, దుకాణాలతో పనిలేకుండా ఆర్డరిచ్చిన కస్టమర్లతో పచ్చళ్లు అందిస్తున్నారు. మంచి ఆహార ఉత్పత్తులు ఇస్తున్నామన్న సంతృప్తితో పాటు చేసిన శ్రమకు ఆర్థిక ప్రయోజనం లభిస్తోందని ఆమె సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరికొంత భూమిని సేకరించి త్వరలోనే వ్యాపారాన్ని విస్తరిస్తానని అనసూయ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో అత్త, మేనల్లుడు మృతి

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో అత్త, మేనల్లుడు మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్డు సమీపంలో శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని వెంగళరెడ్డినగర్‌కు చెందిన నాగినేని రాజ్యమ్మ(52) సత్తెనపల్లి మండలం కొమెరపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ పనిచేస్తుంది. రోజు మాదిరిగానే తన సోదరుడు కుమారుడైన నాగినేని సురేష్‌బాబు (35) కారులో కొమెరపూడి వెళుతుంది. కారు నందిగామ రోడ్డు వద్దకు వెళ్లగానే గుంటూరు వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. కారు నుజ్జు నుజ్జు కాగా రాజ్యమ్మ, సురేష్‌బాబు అక్కడికక్కడే మృతి చెందారు. సురేష్‌బాబు పాస్టర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు భార్య యమునా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. యమునా ప్రస్తుతం గర్భిణి. రోడ్డు ప్రమాదంలో ఇరువురు మృతి చెందడంతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. సంఘటనా స్థలాన్ని సత్తెనపల్లి రూరల్ ఎస్‌ఐ ఆవుల బాలకృష్ణ, సిబ్బంది సందర్శించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతురాలి సోదరుడు నాగినేని రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఉపాధ్యాయురాలు రాజ్యమ్మ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కొమెరపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.





నాగినేని రాజ్యమ్మ, నాగినేని సురేష్‌బాబు మృతదేహాలు

ముస్లింలకు గుర్తింపునిచ్చిన సీఎం జగన్

ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి



ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న మతపెద్దలు

పట్నంబజారు (గుంటూరు తూర్పు): రాజకీయాలకు అతీతంగా ముస్లిం మైనార్టీలకు తగిన గుర్తింపునిచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి చెప్పారు. ఈ నెల 7న సీఎం జగన్ ఆదేశాల మేరకు ఇస్లామిక్ కౌన్సిల్ సెంటర్, ఇస్లామిక్ లైబ్రరీ, దారుల్‌ఖాజ నిర్మాణ పనులకు శంకుస్థాపన పనులను పట్టాభిపురంలోని మౌలానా అబుల్‌కలాం ఆజాద్ షాదీఖానా వెనుక వైపు ఉన్న మున్సిపల్ స్థలంలో ప్రభుత్వం స్వయంగా నిర్మించనుంది. ఈ నేపథ్యంలో బృందావన్‌గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని కలిసి కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ గుంటూరు వెస్ట్ ఉలేమా వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలోపేతం చేయాలన్న కృత నిశ్చయంతో సీఎం జగన్ ముందుకు సాగుతున్నారన్నారు. ముస్లిం మైనార్టీల అభ్యున్నతి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్లతో ఒకడుగు ముందుకు వేస్తే... సీఎం జగన్ నాలుగడుగులు ముందుకు వేసి వారిని అన్ని రంగాలలో బలోపేతం చేస్తున్నారన్నారు. ముస్లింల వెనుకబాటుతనానికి నిరక్షరాశ్యతే ప్రధాన అవరోధం అన్న నిజాన్ని ప్రజాసంకల్ప పాదయాత్ర ద్వారా ముందే గ్రహించిన సీఎం జగన్ ప్రణాళికాబద్ధంగా వారిలో అక్షరాస్యతా శాతం పెంపునకు కృషి చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో ముస్లింలకు ప్రత్యేకంగా కౌన్సిల్ సెంటర్, లైబ్రరీ ఏర్పాటు చేయించాలన్న గుంటూరు మత పెద్దల విజ్ఞప్తి మేరకు మేయర్ మనోహర్‌నాయుడు, స్థానిక ఎమ్మెల్యే మద్దాళి గిరితో చర్చించి ఈ విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకుని వెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు హఫీజ్ అబ్బాస్, హఫీజ్ ఇర్షాద్, మన్సూర్, హఫీజ్ ఇర్షాద్, హఫీజ్ సల్మాన్, హఫీజ్ ఇసాక్, ప్రభుత్వ క్వాజీ హఫీజ్ ఉస్మాన్ సిద్దిఖీ, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ ముఫ్తీ బాసిత్, మౌలానా మెహబూబ్, కార్పొరేటర్ షేక్ రోషన్, షేక్ ఫరియాజ్, షేక్ గౌస్ పీరా ఉన్నారు.

ఏటీఎంలలో మోసాలపై కేసు

గుంటూరు ఈస్ట్: చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఏటీఎంల్లో మోసపూరిత బదిలీల ద్వారా ఆగంతకులు రూ.35 లక్షలు డ్రా చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు అధికారులు కొద్దిరోజుల క్రితం బ్యాంకు అకౌంట్స్‌లో తేడా గుర్తించారు. ఏటీఎం వద్ద ఈమోసం జరిగినట్లు నిర్ధారించుకున్నారు. హిందూ కాలేజీ, బ్రాడీపేట, నగరంపాలెం, మంగళగిరిలలోని తమ బ్యాంకు ఏటీఎంలను పరిశీలించారు. సీసీ కెమెరా పుటేజీలను నిశితంగా పరిశీలించారు. కొందరు వ్యక్తులు ఏటీఎంలో క్యాష్ వచ్చినప్పుడు అక్కడ ఉన్న లింక్‌ను గట్టిగా నొక్కిపట్టుకుంటున్నారు. ట్రాన్స్‌సెక్షన్ ఫెల్యూరని స్క్రీన్‌పై మెసేజ్ వస్తుంది. ఈ కారణంగా బ్యాంకు అధికారులు డబ్బులు డ్రా కాలేదని పొరపాటు పడి అకౌంట్‌దారుడి అకౌంట్‌లో డబ్బులు వాపస్ చేస్తారు. బ్యాంకు ఐటీ మేనేజర్ వంశీ ఫిర్యాదు మేరకు శనివారం పోలీసు కేసు నమోదు చేశారు.